# మై డాడ్ డైడ్ యంగ్!





అట్లూరి పిచ్చేశ్వరరావు-ఈ తరం పాఠకులకు అంతగా తెలియని పేరిది! కథకుడూ, జర్నలిస్టూ, అనువాదకుడూ, సినిమా రచయితా, పుస్తక ప్రియుడూ ఇలా బహుముఖాల వికసించిన వ్యక్తిత్వం పిచ్చేశ్వరరావుది. గ్రామాల్లో నివసించే భారతీయ ఆత్మను ఆవిష్కరిస్తూ ప్రేమ్‌చంద్ రాసిన 'గోదాన్'నూ, మన రాజకీయుల రంగులను బైరంగుచేస్తూ కిషన్‌చందర్ రాసిన 'ఒకానొక గాడిద ఆత్మకథ'-'పేకముక్కలు' నవలలనూ, సహకార వ్యవసాయ క్షేత్రాల స్ఫూర్తిని కళ్లకుకట్టిస్తూ రష్యన్ రచయిత్రి గలీన నికలయేవ రాసిన'అపరిచిత' నవలికనూ, దక్షిణాది నుండి ఉత్తరానికి వెళ్లి అక్కడి భాషలో ఉత్తమరచయితగా ఉవ్వెత్తుస్థానం గడించి, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం వారి ఉత్తమ బహుమతి పొందిన 'ఆరిగెపూడి' అద్భుత నవలకు అనువాదంగా 'ప్రతిధ్వని'నీ, శరత్ కథ బడదీదీని 'బాటసారి' చలనచిత్రకథగానూ మనకందించిన వాడు పిచ్చేశ్వరరావు. నలభై ఒక్క సంవత్సరాల చిన్నవయసులో ఆయన చనిపోయి, అప్పుడే నలభైమూడేళ్లవుతోంది! పిచ్చేశ్వరరావు గురించి వాళ్లబ్బాయి అనిల్ కలబోసుకున్న జ్ఞాపకాలు మీ కోసం...

''1960 దశకం చివర్లో, సాస్త్రి బ్రత తన ఆత్మకథను 'మై గాడ్ డైడ్ యంగ్' అనే పుస్తకంగా రాశాడు. ఈ పుస్తకం పేరు విన్నప్పుడెల్లా నాకు మా నాన్న గుర్తుకొస్తారు. నాకు పదిహేన్నేళ్ల వయసులోనే నాన్న పోయారు-1966లో. అప్పటికాయన వయసు నలభైఏళ్లకు కొంచెం ఎక్కువ. నా కంటికి మా నాన్న అప్పటికీ, ఇప్పటికీ-బహుశా ఎప్పటికీ-యువకుడిలానే అనిపిస్తారు. ఆయన గురించి తల్చుకున్నప్పుడు 'మై డాడ్ డైడ్ యంగ్' అనుకుంటాను'' అంటారు అనిల్ అట్లూరి. ప్రసిద్ధ కథకుడూ, కాలమిస్టూ, అనువాదకుడూ, సినిమా రచయితా అట్లూరి పిచ్చేశ్వరరావు ఏకైక సంతానం అనిల్. వృత్తిరీత్యా కంటెంట్ ప్రొవైడర్ అయిన అనిల్, కాలమిస్ట్ కూడా.

**గుండెలమీది పుస్తకం!**

''చేతిలో పుస్తకంలేకుండా నాన్నను చూసిన జ్ఞాపకం లేదు. ఆయన పఠన దాహానికి అంతంలేదనిపించేది-ఓరేషియస్ రీడర్! అందుకే, నాన్న గురించి తల్చుకున్నప్పుడెల్లా గుర్తొచ్చేది ఒకే బొమ్మ-గుండెల మీద తెరిచిన పుస్తకంతో, పేముకుర్చీలో వెనక్కివాలి ఉండే నాన్న! తెలుగు, హిందీ పుస్తకాలను మించి ఇంగ్లిష్ పుస్తకాలుండేవి. ఎప్పుడూ ఏదో పుస్తకం చదువుతూనో, రాసుకుంటూనో ఉండేవారు. పుస్తకం కొనడంతోనే దానికి చక్కగా అట్టేసి, జాగ్రత్తగా పెట్టేవారు. ఆయన పోగు చేసి పెట్టుకున్న మూడువేల పుస్తకాల్లోనే ఆయన్ను చూసుకుంటున్నాననేది అమ్మ.

''శుభ్రమయిన కాటన్ ప్యాంటూ షర్టూ, స్టైలిష్ చెప్పులు, నున్నగా దువ్విన తలకట్టు-ఒక మాటలో చెప్తే రేడియంట్ ప్రెజెన్స్ నాన్నది. అప్పుడప్పుడు, పంచె కట్టుకోమని అడిగేవాణ్ణి. నన్ను కాదనడం ఇష్టంలేక అలాగే కట్టుకునేవారు. స్వాతంత్య్రం రాకముందు, నాన్న భారత నౌకాదళంలో పనిచేశారు- 1946 ఫిబ్రవరిలో జరిగిన రాయల్ ఇండియన్ నేవీ తిరుగుబాటులో పాల్గొన్నారు కూడా. ఒక్కోసారి, నాన్నను మెడల్స్ అన్నీ తగిలించుకుని యూనిఫామ్ వేసుకోమని పేచీపెట్టేవాణ్ణి. పిల్లల్ని కాదనడం నాన్నకు చేతకానిపని!

**పెంచని తండ్రి!**

''నాన్న నన్ను పెంచలేదు! నా ఇష్టమొచ్చినట్లు పెరగనిచ్చారు. అది ఆయన నమ్మిన సూత్రం. అంతెందుకు- నాన్న నాకు పేరు కూడా పెట్టలేదు. 'బాబు' అని పిల్చేవారంతే. మైలాపూర్‌లోని జెర్మనీ శర్మగారి స్కూల్లో చేర్పించేటప్పుడు-జనమంచి రామకృష్ణ గారనుకుంటా-నాన్నతో పాటు ఉన్నారు. వాళ్లబ్బాయి, నా ఈడువాడే, పేరు అనిల్. అదేపేరు నాకూ పెట్టేశారు. 'పెద్దయ్యాక తెచ్చుకునేదే అసలయినపేరు' అన్నది నాన్న నమ్మకం.

''నాన్నకు తన టైమ్ సద్వినియోగం చేసుకునే కళలో మంచి నైపుణ్యం ఉండేది. తేనాం పేటనుంచి రాత్రిళ్లు మెల్లిగా నడిపించి శాంథోమ్ బీచ్‌కి తీసుకెళ్లేవారు నన్ను. ఒక్కోసారి ఉడ్‌లాండ్స్ డ్రైవిన్ రెస్టారెంట్‌కి-ఆడ్ అవర్స్‌లో-తీసుకెళ్లేవారు. అదంతా, క్వాలిటీ టైమ్ గడిపే పద్ధతి! నాతో చాలా సాయిలా పాయిలాగా ఉండేవారు. నాన్నతో గడిపిన సమయం ఏదో ఆటల్లో గడిపినట్టుండేది నాకు!

**జ్ఞాపకాల జాడలు!**

''నాన్నను గురించిన నా జ్ఞాపకాల్లో వివరాల కన్నా ప్రభావాలు ఎక్కువ. నాన్న పోయేనాటికి నేను చిన్న కుర్రాణ్ణి. అందుకే వాటిని జ్ఞాపకాల జాడలుగానే చూడాలి! అయితే, పరిసరాలన్నా, మనుషులన్నా నాన్నకు అలవిమాలిన ప్రేమ! ఇది ఏవొక్కరికో పరిమితమయిందేం కాదు; తన అయస్కాంత క్షేత్రం పరిధిలోకి వచ్చిన వాళ్లందరికీ-దాదాపు సమానంగా- వర్తించే సూత్రం. మా ఇంట్లో ఓ కేన్ చెయిర్ సెట్ ఉండేది. దానిమీద కూర్చునేవారు నాన్న. నన్ను కాళ్లమీద నిలబెట్టుకుని ఊపుతూ, శతకాలు చెప్పించడం ఇప్పటికీ బాగా గుర్తు. ఆయనకు సంగీతమంటే ప్రత్యేకమయిన అభిరుచి ఉండేది. ఇంట్లో మంచి టేప్ రికార్డర్ ఉండేది. నేషనల్ ఎకో రేడియో వినేవారు ఎక్కువగా.

''1962లో, ప్రత్యగాత్మగారు 'కులగోత్రాలు' సినిమా తీశారు. అందులో పద్మనాభంగారు నేవీ ఉద్యోగి పాత్ర చేశారు. ఆ పాత్ర గెటప్ నిర్ణయించే సందర్భంగానూ, డైలాగ్ రాసేటప్పుడు కూడా నాన్నను కన్సల్ట్ చేశారు ప్రత్యగాత్మ. దాదాపు అదేరోజుల్లో అనుకుంటా-చైనాతో యుద్ధం జరిగింది. యుద్ధానికి పిలుపొస్తే వెళ్లాలని నాన్న ఎదురుచూశారు. ఎందుకోగానీ ఆయన్ని పిలవలేదు మరి. యుద్ధకాలంలో ఇంట్లో ఉన్న కిటికీలూ, వెంటిలేటర్లన్నింటినీ-సినిమా ఫిల్మ్ ప్యాక్ చేసే దళసరి బ్రౌన్ షీట్‌తో -కవర్ చెయ్యడం బాగా గుర్తు.

**నాన్నపోయిన రోజు!**

''నా జీవితంలో మర్చిపోలేని సందర్భం ఏదన్నా ఉంటే, అది నాన్న పోయినరోజే! మద్రాసులో మేం తేనాంపేటలో -ఎల్డామ్స్ రోడ్‌లో-ఉండేవాళ్లం. అర్ధరాత్రి దాటినతర్వాత, నాన్నకు మాసివ్ హార్ట్ అటాక్ వచ్చింది. ఆటో తీసుకురావడంలోనే పుణ్యకాలం కాస్తా హరించిపోయింది. నానా అవస్థలూ పడి ఆస్పత్రికి వెళ్లేసరికే అంతా అయిపోయింది! మర్నాడు మద్రాసులోని ప్రముఖులందరూ వచ్చి నాన్నకు నివాళులర్పించారు. నాన్న మిత్రులూ, దగ్గర బంధువు కూడా అయిన పుండరీకాక్షయ్యగారు దగ్గిరుండి జరగాల్సిందంతా జరిపించారు.

''ఆ పసిప్రాయంలో నాన్న అకాల మరణం నన్ను దారుణంగా దెబ్బతీసినమాట నిజం. అయితే, అమ్మకు తగిలిన దెబ్బ అంతకన్నా చాలా పెద్దది. ఆవిడ చాలాకాలం షాక్‌లో ఉండిపోయి నెమ్మదిగా తేరుకుని తనకాళ్లమీద తను బతికింది-నన్ను బతికించింది. ఈ స్ఫూర్తి నాన్న దగ్గిర్నుంచే పొందాననేది అమ్మ. (మా అమ్మ అట్లూరి చౌదరాణి, ప్రముఖ రచయిత, సంస్కర్త 'కవిరాజు' త్రిపురనేని రామస్వామి కుమార్తె-స్వయంగా రచయిత్రి. అమ్మకూడా కథలూ, నవలలూ రాశారు. నాన్న పోయేనాటికి వీధిగదిలో కూడా అడుగుపెట్టని అమ్మ, ఆ తర్వాత-మద్రాసు పాండీ బజార్‌లో-'రాణీ బుక్ సెంటర్' నడిపించారు. 1990 దశకం చివరివరకూ, మద్రాసులో జరిగిన తెలుగువారి సభలూ సమావేశాల్లో ఆమె చురుగ్గా పాల్గొనేవారు. నాన్న మరణించిన మూడు దశాబ్దాలకు-1996లో-అమ్మ కన్నుమూసింది).

**మిత్రమండలి!**

''నాన్న మిత్రుల్లో మహానుభావులుండేవారు. కొడవటిగంటి కుటుంబరావు, సెట్టి ఈశ్వరరావు, తుమ్మల, ఆనిసెట్టి, రాంభట్ల కృష్ణమూర్తి, ఆరుద్ర, జనమంచి రామకృష్ణ, చలసాని ప్రసాదరావులాంటి ప్రముఖులెందరో ఆయన సన్నిహిత మిత్రబృందంలో ఉండేవారు. ప్రొడ్యూసర్ అట్లూరి పుండరీకాక్షయ్య, ఫిల్మ్ డిస్ట్రిబ్యూటర్లు కాట్రగడ్డ శ్రీనివాసరావు-నరసయ్య, నటులు జగ్గయ్య-బాలయ్య, మెజీషియన్-కమెడియన్ రమణారెడ్డి, రచయిత హరిపురుషోత్తమరావు, ఎగువమతి-దిగువమతి వ్యాపారం చేసే కోయ బాపిరాజు తదితరులు నాన్న మిత్రుల్లో ముఖ్యులు. ఇక మావయ్యలు త్రిపురనేని గోపీచంద్, గోకుల్ చంద్ గురించి చెప్పనవసరం లేదు. అమ్మా-నాన్నల పెళ్లి గోపీచంద్ మావయ్య ఆధ్వర్యంలోనే జరిగింది. అయితే, గోకుల్ చంద్ మావయ్య నాన్నకు బాగా క్లోజ్. వయసు-అభిరుచులు కలవడం అందుకు ఓ కారణం కావచ్చు. సెలవులిస్తే నేను చిన్నమావయ్యా వాళ్లింటికే వెళ్లేవాణ్ణి.

''నాన్న పోయిన మరునటేడాది ఆయన రచనలు పుస్తకరూపంలో వచ్చాయి. వాటిలో కొన్నింటికి కొడవటిగంటి ముందుమాటలు రాశారు. మరి కొన్ని పుస్తకాలను ఆయన రెవ్యూ చేశారు. అవి చదివితే నాన్నతో ఆయన షేర్ చేసిన రిలేషన్ ఎంత గాఢమయినదో అర్థమవుతుంది. ఇక రాంభట్ల గారంటే నాన్నకు చాలా ఇష్టం. వాళ్లిద్దరూ 'విశాలాంధ్ర'లో కలిసి పనిచేశారు. ఆయన చేత చిన్న చిన్న కవితలూ, పాటలూ అనువాదం చేయించి, తన అనువాదాల మధ్యలో వాటిని పొదిగేవారు నాన్న. ఏదోలా రాంభట్ల పేరు చెలామణిలో ఉండాలని తాపత్రయపడేవారు. తన స్నేహితుల విషయంలో నాన్న ఎంత కేరింగ్‌గా ఉండేవారో చెప్పడానికి ఇది చిన్న ఉదాహరణ. నాన్న ఫ్రెండ్స్‌కూడా అలాగే రెస్పాండయ్యేవారు! ఆయన పోయాకా చాలా సంవత్సరాలకు చలసాని ప్రసాదరావు 'కథలూ- కాకరకాయలూ' పుస్తకాన్ని నాన్నకు అంకితం ఇచ్చి, తెలుగు పాఠకులకు అట్లూరి పిచ్చేశ్వరరావును గుర్తు చెయ్యడం చూస్తే వాళ్ల సన్నిహిత సంబంధం అర్థమవుతుంది. వయసుతో నిమిత్తం లేకుండా, చలసాని నన్ను కూడా ఎంతో ఆదరించారు'' అని అనిల్ గుర్తు చేసుకున్నారు.

ఇంటర్వ్యూ: మందలపర్తి కిషోర్, ఫొటో: కె.రమేష్ బాబు

Sakshi - Telugu Daily News Paper, 2nd Nov 2009